

భగీరథ

# నాతిచరామి

టేబుల్ దగ్గర కూర్చుని సీరియస్‌గా రాసుకుంటున్న రామారావు వెనగ్గా వచ్చి కళ్ళు మూసి "ఎవరో చెప్పుకోండి చూద్దాం" అన్నది సీత.

రామారావు ఒక్క క్షణం విరామం పడినా అంతలోనే తేరుకుని "సీతా" అన్నాడు తన వైపు తిప్పుకుంటూ.

రామారావు కళ్ళ మీద నుంచి చేతుల్ని తీసివేసి కిలకిలా నవ్వింది సీత.

రామారావు కుర్చీని వెనక్కి జరుపుకుని, సీతను తన మీదకు లాక్కున్నాడు. ఆ విసురులో పమిట తొలగిపోయింది. సర్దుకోబోయింది సీత. వద్దని కళ్ళతోనే వారించాడు రామారావు.

"మీకెప్పుడు అదేనా ధ్యాస" అన్నది.

"నువ్వు లేదా!" ఆమె వైపు చూస్తూ అన్నాడు.

రామారావు ముక్కును మునిపంటితో కొరికింది అమాంతంగా సీత.

సీత పెదవుల్లోని ప్రేమ మధువుని త్రాగసాగాడు.

హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్టుగా సీత అతన్ని దూరంగా తోసి పమిట సర్దుకుంది.

అర్థంకాక సీతనే చూస్తుండిపోయాడు రామారావు.

"మీకొక మంచి వార్త చెబుదామని వచ్చాను. మిమ్మల్ని చూడగానే ఆ విషయమే మర్చిపోయాను" అన్నది.

"ఏమిటది!" ఆసక్తిగా అడిగాడు ఆమె వైపు జరుగుతూ.

"ఊఁ... దూరం... దూరం..." అన్నది.

"అబ్బ. ఆ వార్త వద్దు. ఏమీ వద్దు దగ్గరకు రానివ్వు" ఆమె జడను చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

"ఆ వార్త వింటే మీరు ఎగిరి గంతేస్తారు. తెలుసా!" అన్నది సీత.

"నిజమా!"

"నిజం మరి"

"అయితే చెప్పు"

"ముందు దూరంగా జరగండి" అన్నది.

"సరే" నంటూ కుర్చీలోంచి లేచి సీతకు కాస్త దూరంలో నుంచున్నాడు.

"కళ్ళు మూసుకోండి"

"ఎందుకు ముద్దు పెడతావా!" చిలిపిగా అడిగాడు.

"అయితే నే వెళ్ళిపోతాను" కోపంగా అంది.

"వద్దు. బుద్ధిమంతుడిలా కళ్ళు మూసుకుంటున్నాను, నోరు కూడా మూసుకోనా!"

చిన్నగా నవ్వుకుంది సీత.

కళ్ళు మూసుకున్నాడు రామారావు.

సీత జాకెట్‌లో నుంచి పేపర్ క్లిప్పింగ్ తీసి అతని కళ్ళ ముందు ఆడిస్తూ "ఊఁ... కళ్ళు తెరవండిక" అన్నది.

"పేపర్ క్లిప్పింగ్ ఎక్కడ నుంచి సీతా!" అన్నాడు. అతని గొంతులో ఆనందం తొణికిసలాడింది. మరోవైపు భయం కూడా తొంగి చూసింది.

గబగబా చదివేశాడు.

కళ్ళు నులుముకుని మరీ చదివాడు.

ఇంకోసారి, మరోసారి చదివాడు.

అంతే పేపర్ క్లిప్పింగ్ టేబుల్ మీద పడేసి సీతను అమాంతంగా పైకి ఎత్తేశాడు.

"బాబోయ్ నేను పడిపోతాను" అన్నది.

"ఏం పడిపోవు. గట్టిగా పట్టుకున్నానుగా" అంటూనే ఆమె పొత్తికడుపు మీద ముద్దు పెట్టుకున్నాడు.

"ఛీ... ఎక్కడంటే అక్కడే నా ముద్దులు" అన్నది.

"నా ఇష్టం. ఇంత మంచి వార్త మోసుకొచ్చావ్. ఈ సంతోష సమయంలో నేను ఏం చేసినా నువ్వు అభ్యంతర పెట్టకూడదు" అన్నాడు.

"ఇంక దింపండి" అన్నది.

అప్పటికే అతని చేతులు నొప్పి పెట్టసాగాయి. మరేం మాట్లాడకుండా క్రిందకు దింపి, తను కూర్చునే కుర్చీలో కూర్చోబెట్టాడు.

"ఎప్పుడొచ్చింది పేపర్ క్లిప్పింగ్" అడిగాడు.

"మీరు ఆఫీసుకి వెళ్ళగానే వచ్చింది. మన పక్కింటి కృష్ణగారిలో చదివించాను. అప్పుడు నాకెంత సంతోషం వేసిందో చెప్పలేను. పంచుకోవడానికి నువ్వు ప్రక్కన లేవుగా" అన్నది.

"నేను ఆఫీసు నుంచి వచ్చి గంటైనా, మరి ఇప్పుడా వచ్చేది!" చిరుకోపంగా అన్నాడు.

"ఉడికిద్దామని రాలేదు. అవును ఇంత మంచి వార్త తీసుకొచ్చాను కదా నాకేం బహుమతి ఇస్తారు!"

"ఏం కావాలి!"

"అడిగింది ఇస్తారా!"

"తప్పకుండా"

"మాట తప్పరుగా"

"ఊహూ" అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని సున్నితంగా నొక్కుతూ.

"మీ కథకి రెండువేలు మొదటి బహుమతి వచ్చిన సందర్భంలో నే కోరే కోరిక మీరు తీరుస్తున్నారు కదూ!"

"అవును"

"అయితే, ఆ బహుమతి నా కిచ్చెయ్యండి బహుమతిగా" అన్నది సీత అతని వైపు చూస్తూ.

రామారావులోని సంతోషం ఒక్క క్షణం నీరు కారిపోయింది.

ఏమిటి ఇలాంటి కోరిక కోరింది

తనుఎంతో కాలంగా కథలు రాస్తున్నా, అవి పబ్లిష్ అవుతున్నా, బహుమతి అంటూ వచ్చింది ఇప్పుడే, ఇదే మొదటి బహుమతి. అందులోనూ తన కథకి ప్రథమ బహుమతి వచ్చింది.

ఈ బహుమతిని తనకిచ్చెయ్య మంటుంది సీత. నిస్వార్థంగా తనని అర్పించుకున్న సీత.

అమాయకమైన సీత.

సీత కోరిక తీర్చలేనిది కాదు. కానీ, ఏ రచయితా ఇలా తన బహుమతిని మరొకరికి ఇవ్వడానికి ఒప్పుకుంటాడా!

ఏమో!

తనిప్పుడేం చెయ్యాలి. సీతకి ఎలా సమాధానం చెప్పాలి.

"మీకు ఇష్టం లేకపోతే వద్దు" కూర్చున్న సీత లేచింది.

ఆమె కళ్ళలోకి చూశాడు. కనుకొనల్లోకి నీళ్ళు ఉబుకుతున్నాయి.

రామారావు వెంటనే తేరుకుని "ఛ ఏమిటా కన్నీళ్ళు. అలాగే ఈ రెండువేలు నీకే ఇస్తాను" అన్నాడు.

రామారావు మాటలు పూర్తిగా వెలువడక ముందే సీత రామారావుని గట్టిగా కౌగలించుకుంది. కాసేపు కాలం కళ్ళు మూసుకుంది.

* * *

ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతున్నాడు రామారావు. అప్పుడే లోపలికొచ్చింది సీత.

రామారావు కళ్ళు తిప్పుకోలేకపోయాడు.

తను కొనిపెట్టిన బ్లూ కలర్ చీరె, అదే రంగు బ్లౌజు, నుదుట బొట్టు, పాపిటిలో కుంకుమ, రెండు చేతులకు నిండుగా గాజులు. స్త్రీత్వం మూర్తీభవించి తన ముందు నుంచున్నట్టు ఫీలయ్యాడు రామారావు.

సీత వచ్చిన అతని కాళ్ళకు నమస్కారం పెట్టింది.

ఊహించని ఈ హఠాత్ పరిణామానికి విస్తుపోయాడు రామారావు. అతనికేం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆమె భుజాలు పట్టుకుని పైకి లేపాడు.


**తను ఎంతోకాలంగా కథలు రాస్తున్నా, అవి పబ్లిష్ అవుతున్నా, బహుమతి అంటూ వచ్చింది ఇప్పుడే, ఇదే మొదటి బహుమతి. అందులోనూ తన కథకి ప్రథమ బహుమతి వచ్చింది. తనకిచ్చెయ్యమంటుంది సీత.....**

కాటుక పెట్టుకున్న ఆ కళ్ళలో కన్నీళ్ళు.

''ఛ ఏమిటిది!'' అన్నాడు తన చూపుడు వేలుతో తుడుస్తూ.

''మా ఆయనొచ్చాడు. నేను మా అత్తగారింటికి వెళ్తున్నాను'' అన్నది.

సీతకు దూరంగా జరిగి నుంచున్నాడు రామారావు. ఆ క్షణంలో సీత, మరొకరి భార్య అన్న విషయం గుర్తుకొచ్చింది. మాట్లాడకుండా ఆమె వంకే చూస్తుండిపోయాడు.



పుట్టింటికి వచ్చి వుండిపోయిన సీతను, తనే మాటలతో మభ్య పెట్టి లొంగదీసుకున్నాడు. ఇన్నాళ్ళు సీత తనకి ఎంతో సుఖాన్ని అందించింది. సీత వెళ్ళిపోతుందని తెలిసి తన మనసు, మనసులో లేదు. ఏదో పోగొట్టుకున్నట్టుగా వుంది.

''నన్ను క్షమిస్తారా!'' సీత అతని వైపు చూస్తూ అడిగింది.

ఆ కళ్ళల్లో చెప్పలేని భావాలు కన్పిస్తున్నాయి.

''నిన్ను నేనా! ఆ మాట అనవలసింది నేను సీతా, కథల్లో ఆదర్శాలు వర్ణించే నేను నిన్ను ఈ విధంగా ఉపయోగించుకున్నందుకు ఎంతో సిగ్గు పడుతున్నాను'' అన్నాడు.

''నేను లొంగకపోతే మీరేం చేస్తారు. ఒక రకంగా చెప్పాలంటే, నేనే మిమ్మల్ని, మీ మంచితనాన్ని ఉపయోగించుకున్నాను'' అన్నది.

రామారావు సీతవైపే చూడసాగాడు.

'అవునండి. మా నాన్న రెక్కల కష్టం మీద బ్రతుకుతుంది మా కుటుంబం. ఆయన స్తోమతకు మించి నా పెళ్ళి జరిపించాడు. ఐదు వేలుకట్నం తీసుకున్న మా ఆయన ఒక సంవత్సరం పాటు నన్ను బాగానే చూశాడు. ఆ తరువాత నుంచే నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి. తన తోటివాడికి ఏడు వేలు కట్నం ఇచ్చా రని, తనకి ఐదువేలే ఇవ్వడం ఎంతో చిన్నతనంగా వుందని, తన స్నేహితుడు తనని హేళన చేస్తున్నాడని, మా ఆయన నన్ను రోజూ నానా మాటలు అంటూ, హింసిస్తున్నాడు. అయినా నేను భరిస్తూనే వున్నాను'' చెప్పడం ఆపింది సీత.

రామారావులోని రచయిత ఆసక్తి కనబరుస్తుంటే, రామారావులోని మనిషి తలొంచుకున్నాడు.

''ఒకరోజు నన్ను బాగా కొట్టి, మిగతా రెండు వేలు తీసుకువస్తేనే నీతో కాపురం చేస్తాను. లేకపోతే లేదు. నీ పుట్టింటికి వెళ్ళి తీసుకురా అని, ఆ అర్ధరాత్రి నన్ను వీధిలోకినెట్టి తలుపు వేశాడు. మీకు తెలుసు. మా నాన్న రెండువేలు కాదు కదా,రెండు వందలు కూడా ఇచ్చే స్థితిలో లేదు. ఇక నాకు చావే శరణ్యం అనుకుంటు న్నప్పుడు మీరు పరిచయమయ్యారు''

రామారావు మౌనంగా వింటున్నాడు.

''మిమ్మల్ని కవ్వించి, నవ్వించి, రెచ్చగొట్టి నా వైపుకు తిప్పుకున్నాను. నా అవసరాలను మీ ద్వారా తీర్చుకుంటు న్నాను. మీ కథకి వచ్చిన బహుమతి డబ్బును నేను తీసుకుంటున్నప్పుడు నా మనస్సు పడ్డ బాధ నేను వ

క్షమించలేను. కానీ, రామారావుగారూ తప్పదు. ఈ రెండురోజులు మా ఆయనకిచ్చి, నేను ఆయన దగ్గరకు వెళ్ళిపోతే మా నాన్న గుండెల మీద బరువు దించినదాన్ని అవుతాను. నేను పెద్దగా చదువుకోలేదు. తెలివితేటలు అంతంత మాత్రమే. ఈ లోకంలో మొగుడు వదిలేసిన దానిగా బ్రతకటం ఎంత దుర్భరమో మీకూ తెలియంది కాదు. అందుకే నా స్వార్థం కోసం, నా కాపురాన్ని నిలబెట్టుకోవటం కోసం, నేనిలా చెయ్యవలసి వచ్చింది. దయచేసి నన్ను మరోలా అర్థం చేసుకోకండి, ప్లీజ్" సీత కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

రామారావులోని రచయిత మరణించిపోయాడు. అతనిలోని మగవాడు సిగ్గుపడ్డాడు.

ఒక స్త్రీ తన కాపురాన్ని నిలబెట్టుకోవడం కోసం, మరో పురుషుడిని ఇలా ఉపయోగించుకుంది అంటే అది కామంతో కాదు, ఈ దరిద్రపు వ్యవస్థలో రక్షణతో బ్రతకటానికి. కట్టుకున్నవాడి గొంతెమ్మ కోర్కె తీర్చడానికి, మరో మగవాడి కోరికకు దాసోహమంది.

కట్టుకున్న పెళ్ళాన్ని డబ్బు కోసం తరిమేశాడు ఒక భర్త.

కట్టుకోని స్త్రీని, కట్టుకున్నంతగా ఉపయోగించుకున్నాడు ఒక రచయిత.

ఇద్దరి మగవాళ్ళ కోరికకు బలైపోయింది ఆ స్త్రీ.

తప్పెవరిది?

పెళ్ళంటే కట్నం కోసమే అని భావించే ఆ మగవాడిదా!

స్త్రీ అంటే సెక్సు కోసమే అని తపించే ఈ మగవాడిదా!

స్త్రీగా పుట్టిన నేరానికి, మగవాడి రక్షణే పరమావధి అని భావించే ఆ మధ్య తరగతి స్త్రీదా!

ఎవరిది తప్పు!

వ్యవస్థదా!

వ్యవస్థను అలా తీర్చిదిద్దిన వ్యక్తులదా!

రామారావు బుర్ర వేడెక్కింది.

కళ్ళు తుడుచుకుంటూ సీత వెళ్ళిపోతూ కన్పించింది.

రామారావు తూలిపడబోతూ ప్రక్కనే ఉన్న తలుపుని పట్టుకున్నాడు.

ఎదురుగా ఉన్న టేబుల్ మీద అతని దృష్టి పడింది.

అది తండ్రి రాసిన ఉత్తరానికి సమాధానంగా రామారావు రాసిన ఉత్తరం. పోస్టు చేద్దామని అంటించి అక్కడ పెట్టేడు.

ఉద్యోగము, రచయితగా తనకి ఉన్న పేరు రెండింటిని మార్కెట్‌లో పెట్టి తండ్రి లక్షరూపాయల బేరం కుదిర్చాడు. ఆ అమ్మాయి ఎమ్మే చదివిందట. తనమాత్రం బి.ఏనే. అయినా ఆ అమ్మాయి ఒప్పుకుంది. ఆమె తండ్రి లక్షరూపాయలు లాంఛనాలు ఇస్తానని అన్నాడట.

తన స్థిరమైన ఉద్యోగము, రచయితగా ఉన్న పేరుకి రెండు లక్షలు కట్నం కావాలి. లక్ష అయితే నేను ఆ సంబంధం ఒప్పుకోనండి అని రామారావు తండ్రికి రాసిన ఉత్తరమది.



**వాయిదా**

బెంచి కోర్టు క్లర్క్ కూతరు గీత, జడ్జి కుమారుడు వినయ్ మాట్లాడుకుంటున్నారు.

"వినయ్... మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం... ఒకటవ సారి అడుగుతున్నా... రెండవ సారి... మూడవసారి..." అని అడిగింది గీత.

"తీర్మానాన్ని రేపటికి వాయిదా వేస్తున్నాను" చెప్పాడు వినయ్.

పి. వినయ్‌కుమార్
(విజయనగరం)

రామారావు తేరుకుని ఆ ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకుని ముక్కలు ముక్కలుగా చేసి చెత్తబుట్టలోకి విసిరేశాడు. అతని కళ్ళలో సీత మెరుస్తోంది.

*


ఆదిలో కుల విభజనకు ఆధారమైనవి వృత్తులు.
ఇప్పుడు, ఆ కులభావంతో కల్మషమయాయి చిత్త వృత్తులు!
ఈ సమాజం ఇలా వర్ణ వివక్షతో కొనసాగవలసిందేనా?!
దుర్గంధ భూయిష్ఠమయిన ఈ కుల పంకిలంలోపడి ఇలా
కొట్టుమిట్టాడవలసిందేనా?! ఈ జిజ్ఞాసకు అక్షరరూపం –

# వర్ణమాల

ధారావాహిక.

కుల వ్యాకులంతో కుమిలి, భాషావైషమ్యంతో కలిగిన
ఓ జంట హృదయ జ్వాల! అల్పత్వానికీ, మానవత్వానికీ నడుమ
చెలరేగిన ఘర్షణ! అసహన తత్వానికీ, సహిష్ణుతకూ మధ్య
నడిచే రమ్యహేల! మిమ్మల్ని సీరియస్ గా ఆలోచింప జేస్తూ,
నీ 'రియల్' సొసైటీ అంటూసాగే సీరియల్!

'అన్వేషి' రచన 'వర్ణమాల'

ఈ నెల విజయ లో నేడే చదవండి!